# బాలమిత్ర

**- వాసంతి మాఘపు.**

బోసినవ్వులు ఒలకబోసే చిన్నారులను చూస్తే ఎవరికి ముచ్చట అనిపించదు? నిర్మల హృదయముతో, భగవదాంశతో, దైవత్వం ఒట్టిపడే వారిలో కల్మషాన్ని జోడించేది మనమే అంటే చాలా మంది అంగీకరించరు. కానీ ఇది నిజం. వారు నిష్కల్మషంగా, నిర్భయంగా నిజాలు మాట్లాడేవారిని - మన స్వార్థంకోసం తప్పుదోవ పట్టించేది మనం కాదూ! కల్లాకపటం ఎరుగని అలాంటి పసివారినుండి పెద్దలమనుకునే మనం నేర్చుకోవలసినది ఎంతో ఉంది. సరే ఈ చిన్నారులందరూ బాలకృష్ణుని రూపాలుగా మనం విశ్వసిస్తూ ఈ తారంగం పాట పాడితే ఎంత మోహనంగా ఉంటుంది.

## తారంగం తారంగం

తారంగం తారంగం - తాండవ కృష్ణా తారంగం
అల్లరి కృష్ణా తారంగం - పిల్లలకిష్టం తారంగం
ముద్దుల కృష్ణా తారంగం - మురిపాల కృష్ణా తారంగం
మాధవ కృష్ణా తారంగం - యశోధ కృష్ణా తారంగం
వేణు నాధా తారంగం - వెంకట రమణా తారంగం
రాధా కృష్ణా తారంగం - రమణీయ కృష్ణా తారంగం
గోపాల కృష్ణా తారంగం - గోకుల నాధ తారంగం
వెన్నెల దొంగ తారంగం - చిన్ని కృష్ణా తారంగం
చిన్మయ రూపా తారంగం - చిద్విలాస తారంగం
విశ్వమంతయు తారంగం - నీవేనయ్యా తారంగం.

**పద్యం:** ఎలుగు తోలు తెచ్చి యెన్నాళ్ళు నుదికిన
నలుపు నలుపె కాని తెలుపు కాదు
కొయ్యబొమ్మదెచ్చి కొట్టిన పలుకునా?
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థం:** ఎలుగుబంటి చర్మాన్ని తెచ్చి ఎంతకాలము ఉతికినను అది తెలుపు రంగుకు రాదు. కొయ్యబొమ్మను కొట్టినా, తిట్టినా అది మాట్లాడదు. అలాగే మూర్ఖుని మనస్తత్వముకూడా మారదు అని భావము.

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

**1.** ఇది 5 అక్షరముల ఊరి పేరు, పూర్ణానుస్వారముతో ముగుస్తుంది..

**2.** మొదటి మూడు అక్షరములు చేపను తెలియజేస్తాయి.

**3.** రెండు, మూడు అక్షరములు ఒక దేశమును తెలియజేస్తాయి.

**ఏమిటా పదం?**

**సమాధానం చెప్పగలరా? ప్రయత్నించండి!**

1. మూడు కళ్ళున్నా చూడలేనిది ఏమిటి?
2. నాలుగు కాళ్ళున్నా నడవలేనిది ఏది?
3. 'తంతా' అంటే కదిలేది. 'అమ్మా-బొమ్మ' అంటే కదలనిది. ఏమిటి?
4. గాలి వీచినా హరీ అంటుంది. గాలి అసలు లేకపోయినా హరీ అంటుంది. ఏమిటి?

(సమాధానములు వచ్చే సంచికలో)

గత సంచికలోని **'సమాధానం చెప్పగలరా?'** సమాధానములు.

1. కొత్త చెప్పులు. 2. తాళం కప్ప.
3. సిరా పెన్ను.
4. మానవ శరీరం -ప్రాణం.

## అహంకారము

పూర్వము ఒక ఊరిలో ఒక శిల్పకారుడు ఉండేవాడు. అతడు సృజించిన శిల్పము జీవము ఉట్టిపడుతూ, ఎవరినైనా తన్మయుల్ని చేసేవిధముగా ఉండేది. అతని పనితనమునకు ఆ ఊరి జనులు ముగ్ధులయ్యేవారు. అతనికికూడా అతని పనితనము వలన కాస్త అహంకారము ఉండేది.

ఒకసారి ఒక జ్యోతిషశాస్త్రవేత్త కారణముగా అతనికి మరణకాలము ఆసన్నమైనదని తెలియవచ్చింది. అతనికి మరణభయము ప్రారంభము అయ్యింది. బెంగ మొదలయ్యింది. ఎటులైననూ తను మరణమును తప్పించుకొని, కీర్తిప్రతిష్ఠలతో ఎక్కువ కాలము జీవించవలెనని తీవ్రముగా ఆలోచించసాగాడు.

పురాణకథలవలన గ్రహించినది, ఉత్తముల సహచర్యమువలన తను గ్రహించినది ఆధారముగా, యమధర్మరాజు ఒక జీవి మరణకాలము సమీపించినప్పుడు తనవద్ద పాశముతో ఆజీవి ప్రాణములు తోడ్కొని పోవునని తలచి, దానిని తప్పించుకొనుటకై ఉపాయమునకు దీర్ఘముగా ఆలోచించగా - చివరకు ఒక ఉపాయము తోచెను. అతను దీక్షతో తనను పోలిన శిల్పములను చాలావానిని తయారుచేసి, వాటికి తనకూ ఎలాంటి తేడా లేదని అనిపించే విధముగా తీర్చిదిద్ది, ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని, అంత్యకాలము సమీపించగా ఆ శిల్పములను వరుసగా పరుండబెట్టి వాటి మధ్యలో తనూ పరుండి, ఊపిరిని నియంత్రించి యమధర్మరాజు ఆగమనమున్కై వేచి యుండెను.

యమధర్మరాజు ఆ శిల్పి ప్రాణములు హరించడానికై ఆ ప్రాంగణములోనికి అడుగిడి, శిల్పిని పోలిన అనేకమంది శిల్పులను కాంచి, తడబడి, పాశమును ప్రయోగించేముందు తను శిల్పిని గుర్తించవలెనని, ఎన్నోవిధములుగా ప్రయత్నించెను. శిల్పి కదలక మెదలక బొమ్మవలె పరుండెను. తన కార్యమును నెరవేర్చకుండా యమధర్మరాజు అక్కడనుండి కదలలేడు. ఈ సంకటస్థితినుండి బయటపడేందుకు ఆలోచించగా, ఆయనకొక ఉపాయము స్ఫురించెను.

యమధర్మరాజు ఆ శిల్పములను ఒక్కొక్కదానిని నిశితముగా పరిశీలిస్తూ, ఆ శిల్పి నైపుణ్యమును మెచ్చుకుంటూ, ఒక శిల్పమువద్ద ఆగి "ఈ శిల్పమున అంతా బాగుగనే యున్నది, కాని ..." అన్నంతలో అహంకారియైన ఆ శిల్పి దిగ్గన లేచి "ఏమేమీ నేను నిర్మించిన శిల్పమున లోపమా!" అంటూ, యమధర్మరాజు కార్యమును సులభము చేసెను. ఆ శిల్పి తన తప్పు గ్రహించేలోపలే అంతా జరిగిపోయింది. ఈ విధముగా శిల్పి అహంకారము అతనిచే మాట్లాడించి, అతని ప్రాణములు పోవుటకు కారణమైనది.

***నీతి :*** *ఒక వ్యక్తి ఆధ్యాత్మికముగా ఉన్నతస్థితిని పొందడానికి, తద్వారా నిత్యానంద స్థితిని పొందడానికి అహంకారమును విడువవలెను.*